క్లుప్తంగా

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండి పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో దరఖాస్తు చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కృష్ణాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలందుకున్న కృష్ణయ్య

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలోని మురళీకృష్ణ ఆలయంలో మహాలక్ష్మీదేవి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలిరోజు శుక్రవారం ఆలయంలోని శ్రీకృష్ణుడి మండపం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహం ఉంచి పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి సహస్రకుంకుమార్చన పూజలు, నక్షత్ర హారతి, పవళింపు సేవ వంటి కార్యక్రమాలు చేపట్టారు.

- రెండో రోజు అయిన శనివారం భీష్మ ఏకాదశి పురస్కరించుకుని ఉదయం 5 గంటలకు నవనీత హారతి, చందన అలంకరణ, తులసీదళార్చన, సుదర్శన హోమం, ఉదయం 10 గంటలకు భగవద్గీత పారాయణం, బాలలచే నృత్య ప్రదర్శనలు ఉంటాయి. ఆదివారం ఉత్సవాల ముగింపు రోజు స్వామి, అమ్మవార్లను పుర వీధుల్లో ఊరేగిస్తారు. మురళీకృష్ణ ఆలయ కమిటీ మరియు మురళీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారిలో పుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. పలువురు వ్యాపారులు నడిచేందుకు వీల్లేకుండా ఫుట్‌పాత్‌లపై సామగ్రి, భారీ వస్తువులు పెడుతున్నారు. వీటిపై నిత్యం ఫిర్యాదులు అందడంతో శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టారు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ప్రత్యేక బృందాలతో ఫుట్‌పాత్‌లపై ఉన్న సామగ్రి తొలగించారు. ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ తొలగింపు చేపట్టామని సచివాలయ సెక్రటరీ దామోదర్ తెలిపారు. మళ్లీ ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ముగింపు సందర్భంగా నా ఆటోగ్రాఫ్ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తెలుగు సినిమా దినోత్సవాన్ని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన వారు, సంస్థలు, ప్రభుత్వం కలిసి పెద్ద ఎత్తున జరపాలన్నారు. పరిశ్రమ అభివృద్ధికి దోహదపడిన వారిని గుర్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు వచ్చే ఏడాది నుంచి ఘనంగా జరుపుతామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, బాబ్జి, సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు





బుచ్చిరాజుపాలెం గవర వీధి వ్యూ

- వరుస చోరీలతో బెంబేలు
- బుచ్చిరాజుపాలెంలో ఇటీవల 7 చోట్ల దొంగతనాలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- నిఘా పెంచాలని కోరుతున్న స్థానికులు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి బుచ్చిరాజుపాలెం, గవర వీధి పరిసర ప్రాంతాల్లో దొంగలు అలజడి సృష్టిస్తున్నారు. వరుస దొంగతనాలు జరగడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. చిరుద్యోగాలు చేసి కష్టపడి సంపాదించుకున్న నగదు, బంగారం దొంగలపాలవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి నిఘా పెంచాలని కోరుతున్నారు.

ఆర్నెల్లు.. ఏడు దొంగతనాలు

ఆర్నెల్లో ఒక్క బుచ్చిరాజుపాలెం, గవరవీధిలో సుమారు 7 దొంగతనాలు జరిగాయి. ఈ చోరీల్లో దొంగలు తెలివిగా వ్యవహరించారు. ఇప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించలేదు. చేతికి గ్లౌజులు వేసుకుని దొంగతనాలు చేస్తుండడంతో వేలిముద్రలు కూడా దొరకడంలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి పనేనని పోలీసులు, స్థానికులు అనుమానిస్తున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాలి

వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో క్రైం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యావంతులు కోరుతున్నారు.



చోరీ జరిగిన ఇంట్లో చిందర వందరగా వస్తువులు(ఫైల్)

దొంగతనాల్లో జరిగిన నష్టం

- ఒక ఇంట్లో రూ.7లక్షలు, 14 తులాల బంగారం
- మరో ఇంట్లో రూ.4లక్షల నగదు, 3 తులాల బంగారం
- ఇదే ప్రాంతంలో సుమారు రూ.50వేల నగదు.. తులం బంగారం పోయింది.
- నగదు, బంగారానికి గల ఆధారాలు చూపలేక పోవడంతో ఆ స్థాయిలో పోలీస్ రికార్డుల్లో నమోదు కాలేదని బాధితులు వాపోతున్నారు.

రైల్వే ట్రాక్‌కు చేరువగా ఉండడమే కారణం

బుచ్చిరాజుపాలెం గవర వీధి, గాంధీనగర్, రెడ్డివీధి, జయప్రకాష్‌నగర్ ప్రాంతాలు రైల్వే ట్రాక్‌కు చేరువగా ఉంటాయి. దీని వల్ల దొంగలు రావడానికి .. చోరీ చేసిన తర్వాత తప్పించుకుని పోయేందుకు సులువుగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ట్రైన్లు మెల్లగా వెళ్లడం, కొన్ని ఆగుతున్నాయి. రాత్రి వేళ దొంగలు ఇక్కడ దిగి దొంగతనాలకు పాల్పడి రైల్వే ట్రాక్ వైపు పారిపోతున్నారని చెబుతున్నారు.



బుచ్చిరాజుపాలేనికి చేరువగా ఉన్న రైల్వే ట్రాక్

నిఘా పెడతున్నాం

దొంగతనాలకు చెక్ పెట్టడానికి ప్రత్యేక నిఘా పెట్టాం. సీసీటీవీ పుటేజీలను సైతం సేకరించి పరిశీలిస్తున్నాం. ప్రజల నుంచి కూడా సహకారం కావాలి. తాళం వేసి ఉన్న ఇళ్లే దొంగతనాలకు గురవుతున్నాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఇంట్లో ఎవరో ఒకరు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. ఎవరూ లేక పోతే ఇంట్లో విలువైన వస్తువులు ఉంచవద్దు. క్యాంపులకు వేళ్లే వారు పోలీసులకు సమాచారమివ్వాలి. ఎల్‌హెచ్ఎంఎస్ ఏర్పాటు చేసి నిఘా పెడతాం. అపార్టమెంట్లు, గ్రూప్‌హౌస్‌లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. దీని వల్ల దొంగలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం గురించి తెలుస్తుంది.

–నిమ్మకాయల శ్రీనివాసరావు, సీఐ, వెస్ట్ సబ్ డివిజన్

వెట్టి చాకిరీ నిర్మూలిద్దాం



ర్యాలీలో పాల్గొన్న జేసీఎల్ రామారావు, డీసీఎల్ సునీత తదితరులు

సీతంపేట: వెట్టి చాకిరీ, కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు అన్నారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు.కార్మిక శాఖ కార్యాలయం నుంచి మహారాణి పార్లర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం చేపట్టారు. వెట్టి చాకిరీ నిర్మూలన, శిశు హక్కుల పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత, ఏసీఎల్‌లు గోవిందు, రాజు, సహాయ కార్మిక అధికారులు, జిల్లా న్యాయ సేవా సమితి, ఐజేఎం, నేచర్, సీఈఎఫ్‌హెచ్‌ఏ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రమాబాయికి ఘన నివాళి



రమాబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సింధియా: భారత జాతి మాతృమూర్తి రమాబాయి నిస్వార్థ త్యాగాలే అంబేడ్కర్ ఉన్నతికి సోపానాలయ్యాయని ఉపాలీ బుద్ధ విహార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెయ్యల సిద్ధార్థ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో శుక్రవారం రమాబాయి జయంతి పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆనందరావు, ఉల్లి రమణ, ధర్మరావు, సమత తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని జోన్‌లోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కమిటీ స్వాగతిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం చేసిన నిర్ణయం ప్రజా విజయమన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం విశాఖ, ఉత్తరాంధ్రకు నష్టం చేసే చర్యలు, వివక్ష మాత్రం ఆపలేదన్నారు. వాల్తేర్ డివిజన్‌ను ముక్కలు చేసిందని, 1090 కిలోమీటర్ల పరిధి గల వాల్తేర్ డివిజన్‌లో 680 కిలోమీటర్ల పరిధిని ఒడిశాలోని రాయఘడ్ డివిజన్‌లో కలిపిందన్నారు. దీనిలో అత్యంత కీలకమైన కొత్తవలస–కిరండోల్ (కేకే లైన్) రైలు మార్గం, విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి భారీ ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు ఉన్నాయని, ముడిసరుకు, రవాణా, ఎగుమతులు, దిగుమతుల్లో కేకే లైన్ అత్యంత కీలకమైనదని తెలిపారు. వాల్తేర్ రైల్వే డివిజన్ సాలీనా రూ. 10,500 కోట్ల ఆదాయం పొందుతున్నదంటే దీనికి కారణం సరకు రవాణా, కేకే లైన్ అని, అటువంటి కేకే లైన్‌ను విశాఖ నుంచి తొలగించి ఒడిశాలో కలపడమంటే విశాఖపట్నం, ఉత్తరాంధ్ర, ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీయడమేనని, ఆర్థిక నష్టంతో పాటు రాబోయే కాలంలో స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టు తదితర ప్రభుత్వరంగ సంస్థలకు కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. కేకే లైన్‌తో సహా వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో కొనసాగించే నిర్ణయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న విశాఖ రైల్వే స్టేషన్ వద్ద నిరసన చేపట్టనున్నట్టు చెప్పారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. పద్మ, వి. కృష్ణారావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికకు న్యాయం చేయాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సీతమ్మధార: సింహాద్రిపురంలో నివాసం ఉంటున్న జీవీఎంసీ క్లాప్ డ్రైవర్ కుమార్తెపై లైంగిక దాడి ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.మణి మాట్లాడుతూ ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై రాష్ట్ర హోం మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్, నీలి చిత్రాలు, సాహిత్యాన్ని అరికట్టాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే నిందితుడికి కఠిన శిక్ష వేయాలన్నారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షుడు టి.నూకరాజు, జె.ఆర్. నాయుడు, అనిల్, సురేష్ ఈ. ఆదినారాయణ, శ్రావణ్, కె. కుమారి, హేమలత, కొండమ్మ, అనిత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జాము సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

చిత్రలేఖన పోటీల్లో గోపాలపట్నం బాలికల ప్రతిభ





బంగారు పతకాలు వచ్చిన సంక్రాంతి, జంతు ప్రదర్శనశాల చిత్రాలు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు చిత్రలేఖనంలో విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఇటీవల నెల్లూరులో జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అందులో గోపాలపట్నం బాలికల ఉన్నతపాఠశాల 9వ తరగతి,, 8వ తరగతి, 7వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. వీరు గీసిన సంక్రాంతి, జంతు ప్రదర్శన, జాతీయ సమైక్యతా చిత్రాలకు బంగారు పథకాలు లభించాయి. విద్యార్థులు జె. లక్ష్మి, కె. రేష్మశ్రీ, పి. వైష్ణవి, కె. శార్వాణి, పి. తేజశ్విని బగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరితో పాటు మరిం కొంత మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో పాటు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మోహనరావును ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.మరిన్ని పురస్కారాలు సాధించాలని ఆశీర్వదించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు

షిప్‌యార్డ్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ ఇవ్వాలి



పీఎఫ్ జాయింట్ కమిషనర్ పనవ్ జాస్తిని కలిసిన జిల్లా పెన్షనర్ కమిటీ సభ్యులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ పెన్షన్‌దారులకు హయ్యర్ పెన్షన్ లేదనడం అన్యాయం అని జిల్లా పెన్షన్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చినట్టే తమకు కూడా హయ్యర్ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ సభ్యులు శుక్రవారం పీఎఫ్ జాయింట్ కమిషనర్ పనవ్ జాస్తిని కోరారు. అయితే హిందూస్థాన్ షిప్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, బీహెచ్‌ఈఎల్, కోరమండల్ వంటి సంస్థలకు హయ్యర్ పెన్షన్ వచ్చే అవకాశం లేదని, ఆయా సంస్థలకు రిజెక్షన్ లెటర్లు ఆన్‌లైన్‌లో ఇప్పటికే పంపామని ఆమె తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వాలు విశ్రాంత ఉద్యోగులపై చిన్నచూపు చూడడం తగదన్నారు. హయ్యర్ పెన్షన్ సాధించేవరకూ తమ పోరాటం ఆగదన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు కె.పి.కుమార్, ఎస్.రామలింగేశ్వరరావు, వి.అప్పలరాజు, నారాయణరావు పాల్గొన్నారు.

ఇలాగేనా గోతుల పూడ్చివేత!

జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ సేవా మార్గంలో భూ గర్భ పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతను సరిగ్గా పూడ్చలేదు. ఆ గొయ్యిపై మట్టి దిబ్బగా వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ మార్గంలో వీధిదీపాలు లేక పోవడంతో రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు,వృద్ధులు ఆ మట్టి దిబ్బను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

– మల్కాపురం



ప్రకాష్‌నగర్ సేవా మార్గంలో సరిగ్గా కప్పని గుంత

గ్రామ సింహాల దర్జా



మల్కాపురం వద్ద పార్కు చేసిన కారుపై సేదతీరుతున్న శునకం



గుల్లలపాలెం వద్ద పార్కు చేసిన కారుపై వీధికుక్క

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం పరిసర ప్రాంతాల్లో గ్రామసింహాలు పగలు,రాత్రి అన్న తేడా లేకుండా వీధుల్లో సంచరిస్తున్నాయి. ఆ మార్గాన వచ్చే వారిపై దాడికి దిగుతున్నాయి. అంతేనా దర్జాగా కార్లపై సేద తీరుతున్నాయి. అలాగే 61వ వార్డు మల్కాపురం పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు ఆటోలు, కార్లపైకి ఎక్కి దర్జాగా సేదతీరుతున్నాయి. అధికారులు స్పందించి కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.